
ఖేడ్ ట్రాన్స్‌కో ఏఈ సస్పెన్షన్

నారాయణఖేడ్, జనవరి 12: నారాయణఖేడ్ ట్రాన్స్‌కో ఏఈగా విధులు నిర్వహిస్తున్న రవికుమార్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. గతంలో కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డు పరిధిలో పనిచేస్తున్న సమయంలో జరిగిన అక్రమాలపై ఈ సస్పెన్షన్ విధించినట్టు ట్రాన్స్‌కో ఏడీఈ నాగేంద్రకుమార్ తెలియజేశారు. ఆయన స్థానంలో ప్రస్తుతం కల్హేర్ ఏఈగా విధులు నిర్వహిస్తున్న వి.నారాయణకు నారాయణఖేడ్ ఏఈగా అదనపు బాధ్యతలను అప్పగించినట్లు ఆయన తెలిపారు.

'గ్యారంటీ' దరఖాస్తులే లెక్కలోకి!



ప్రభుత్వం పంపిణీ చేసిన ఫారాల్లోని వివరాలే ఆన్‌లైన్‌లో నమోదు

- తెల్లకాగితాలపై వచ్చిన అర్జీలకు నో ఎంట్రీ!
- 75 శాతం పూర్తయిన ప్రజాపాలన డాటాఎంట్రీ
- రేషన్‌కార్డుల కోసం భారీగా దరఖాస్తులు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, మెదక్, జనవరి 12: ఆరు గ్యారంటీ పథకాలు రేషన్‌కార్డు ఉన్నవారికేనా? అంటే అవుననే తెలుస్తున్నది. అర్హులైనవారు రేషన్‌కార్డు లేకపోయినా తెల్లకాగితంపై అర్జీ పెట్టుకుని దరఖాస్తు చేసుకోవచ్చని నాయకులు, అధికారులు చెప్పిన మాటలు వట్టివేనని అర్థమవుతున్నది. ప్రజాపాలన దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియలో ప్రభుత్వం అందజేసిన దరఖాస్తు ఫారాల్లోని సమాచారాన్ని మాత్రమే ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేస్తున్నారు. తెల్లకాగితంపై రాసిచ్చిన అర్జీలను పక్కనపెడుతున్నట్టు తెలిసింది. రేషన్‌కార్డు ఉన్నవారికి మాత్రమే దరఖాస్తులు అందజేసిన అధికార యంత్రాంగం ఫారాల్లోని వివరాలను మాత్రమే పరిగణలోకి తీసుకుంటున్నది.

అనూహ్య స్పందన

ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలనకు మెదక్ జిల్లాలో అనూహ్య స్పందన లభించింది. ఐదు గ్యారంటీ పథకాలకు డిసెంబరు 28 నుంచి జనవరి 6 వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. రేషన్ కార్డులతో పాటు ఏ ఇతర సమస్యలు ఉన్నా తెల్ల కాగితంపై దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఇలా గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదుచేసే ప్రక్రియకు 7 నుంచి శ్రీకారం చుట్టింది.

2.73 లక్షల దరఖాస్తులు

ప్రజాపాలన సభల ద్వారా జిల్లాలో 2,73,489 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో గ్యారంటీలకు సంబంధించి 2,23,357 కాగా మిగిలినవి ఇతర పథకాల కోసం వచ్చాయి. ఇప్పటికే 75 శాతం దరఖాస్తులు ఆన్‌లైన్ చేశారు. ఈ నెల 17 వరకు ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. మున్సిపల్, తహసీల్దార్, ఎంపీడీవో, జిల్లా గ్రామీణాభివృద్ధి, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థతో పాటు ప్రైవేటుగా పనిచేస్తున్న మొత్తం 480 మంది కంప్యూటర్ ఆపరేటర్లకు గ్యారంటీల దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే బాధ్యతలను అప్పగించారు. ఒక్కో ఆపరేటర్ 500 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఈక్రమంలో తెల్లకాగితంపై రాసిచ్చిన అర్జీలను మాత్రం పక్కన పెడుతున్నారు.

రేషన్‌కార్డు కోసమే ఎక్కువ..

ఆరు గ్యారంటీలతో పాటు ఇతర సమస్యలపై వేలాది మంది తెల్లకాగితంపై దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో రేషన్‌కార్డు కోసం వచ్చిన దరఖాస్తులే అధికంగా ఉన్నాయి. గ్యారంటీలకు దరఖాస్తు చేసుకోవడానికి రేషన్‌కార్డును తప్పనిసరిచేశారు. దీంతో చాలామంది రేషన్‌కార్డు కోసం తెల్ల కాగితంపై దరఖాస్తు చేసుకున్నారు. ప్రజాపాలన దరఖాస్తుల్లో ఆధార్, రేషన్‌కార్డుల నంబర్లు నింపాలని అడిగారు. అంతేకాకుండా రేషన్‌కార్డు, లబ్ధిదారుల జిరాక్స్ ప్రతులను జతచేయాలని సూచించారు. అలా జతచేసిన దరఖాస్తులను మాత్రమే ఎంట్రీ చేస్తున్నారు. వివిధ సమస్యలపై తెల్లకాగితంపై రాసి ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఆయా శాఖలకు పంపించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ రాజర్షిషా వెల్లడించారు.



అల్లాదుర్గం ఐబీ చౌరస్తా వద్ద గ్రిల్‌లో తల ఇరుక్కున్న బాలుడు

ఇనుప గ్రిల్‌లో ఇరుక్కున్న బాలుడి తల

తల్లితో కలిసి బస్సు కోసం వేచిచూస్తూ ఆడుకుంటుండగా ఘటన

అల్లాదుర్గం, జనవరి 12: తల్లితో కలిసి బస్సు కోసం వేచిచూస్తున్న చిన్నారి ఆడుకుంటుండగా రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన రక్షణ గ్రిల్‌లో తల ఇరుక్కోవడంతో గంట పాటు అవస్థపడ్డాడు. ఈ ఘటన మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలోని చిల్వెర్ సమీపంలో 161వ జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులోని ఐబీ చౌరస్తా వద్ద శుక్రవారం సాయంత్రం జరిగింది. బస్సు కోసం ఓ ప్రయాణికురాలు ఐదేళ్ల కుమారుడితో కలిసి ఎదురు చూస్తున్నది. బాలుడు పక్కనే ఆడుకుంటుండగా పక్కనే ఏర్పాటు చేసిన గ్రిల్‌లో తల పెట్టాడు. బయటకు రాకపోవడం ఏడ్పు మొదలుపెట్టాడు. స్థానికులు గంట పాటు కష్టపడి గ్రిల్‌ను కట్‌చేసి బాలుడిని కాపాడారు.

నిజాం షుగర్స్ పునరుద్ధరణకు చర్యలు

- అధ్యయనానికి మంత్రి శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో కమిటీ
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్‌రాజనర్సింహ
- రాయికోడ్ మండలం మాటూరు వద్ద ప్రైవేటు షుగర్ ఫ్యాక్టరీ ప్రారంభం

రాయికోడ్, జనవరి 12: రాష్ట్రంలో మూతపడిన నిజాం షుగర్స్ పరిశ్రమలను తిరిగి ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. ఇందుకోసం మంత్రి శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో కమిటీని వేయనున్నట్టు ఆయన తెలిపారు. సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల పరిధిలోని మాటూరు గ్రామ శివారులో అగ్రిప్రొడక్ట్స్ ప్రైవేట్ షుగర్ ఫ్యాక్టరీ నిర్మాణానికి మంత్రి భూమిపూజ, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కృషిచేస్తున్నదని తెలిపారు. రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యంత్రపరికరాలు అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని వివరించారు. ఈ ప్రాంతంలో రైతులు పండించిన చెరకును కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు తరలించడానికి రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఇక్కడే పరిశ్రమలు ఏర్పాటయితే రైతులకు సౌకర్యవంతంగా ఉంటుందని అన్నారు. ఇందుకోసం ముందుకువచ్చేవారికి ప్రభుత్వం సహకరిస్తుందని తెలిపారు. ఎంపీ బీబీపాటిల్ మాట్లాడుతూ బసవేశ్వర, సంగమేశ్వర ఎత్తిపోతల పనులు త్వరగా ప్రారంభిస్తే ఈ ప్రాంత రైతులు ఆర్థికంగా నిలదొక్కుకుంటారని పేర్కొన్నారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి మాట్లాడుతూ రైతులకు సబ్సిడీపై యంత్రపరికరాలు అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని వివరించారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అలవాటు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్, అడిషనల్ కలెక్టర్ మాధురి, పంచగామ పీఠాధిపతికాశీనాథ్‌బాబా, జడ్పీటీసీ మల్లికార్జున్‌పాటిల్, ఎంపీపీ మమత, జిల్లా కాంగ్రెస్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ అంజయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాలాజీనర్సింలు, దిగంబర్‌రావు, సతీష్‌కుమార్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్‌చారి, జహీరాబాద్ ఆర్డీవో వెంకటరెడ్డి, సర్పంచ్‌లు ప్రవీణ్‌కుమార్, రాధికా సతీష్ కుమార్, ఎంపీటీసీలు పండరి, శివకుమార్‌పాటిల్, నాయకులు వినోద్‌పాటిల్, సిద్దన్నపాటిల్, బస్వరాజ్‌పాటిల్, హన్మంతురావుపాటిల్, ఆయా గ్రామాల రైతులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ



విద్యుత్ ఉత్పత్తి అనంతరం దిగువకు విడుదలవుతున్న జలాలు

ఘనపురం ఆయకట్టుకు సింగూరు జలాలు విడుదల

- యాసంగి సీజన్‌కు 4.06 టీఎంసీలు
- సీజన్ పూర్తయ్యే వరకు దశలవారీగా నీటి విడుదల

పుల్‌కల్, జనవరి 12: మెదక్ జిల్లా పరిధిలోని ఘనపురం ఆయకట్టు పరిరక్షణకు శుక్రవారం సింగూరు జలాలను విడుదల చేశారు. ఘనపురం ఆనకట్ట కుడి, ఎడమ కాలువల కింద ప్రస్తుతం యాసంగి వరి నాట్లు ఊపందుకున్నాయి. ఆయకట్టు పరిరక్షణకు సింగూరు జలాలను విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సింగూరు ప్రాజెక్టు అధికారులు శుక్రవారం ఉదయం 11.30 గంటలకు నీటి విడుదలను ప్రారంభించారు. ప్రాజెక్టుకు ఎడమ వైపున నిర్మించిన జల విద్యుత్ కేంద్రంలోని 7.5 మెగావాట్ల సామర్థ్యం గల రెండు విద్యుత్ ఉత్పత్తి చేసేలా ప్రత్యేక గేట్ల ద్వారా 2,667 క్యూసెక్కుల నీటిని దిగువన గల మంజీర జలాశయంలోకి వదులుతున్నారు. మంజీర జలాశయానికి జలాలు చేరుకున్న అనంతరం శని లేదా ఆదివారం ఘనపురం ఆనకట్టకు విడుదలచేసే అవకాశాలున్నాయి. యాసంగి సీజన్‌కు పూర్తయ్యే వరకు 4.06 టీఎంసీల జలాలను విడుదల చేయనున్నట్లు ప్రాజెక్టు జేఈఈ మహిపాల్‌రెడ్డి తెలిపారు. మొదటి విడతగా 0.35 టీఎంసీ జలాలను విడుదల చేశామని, వరి పంట కోతకు వచ్చేంత వరకు విడతలవారీగా నీటిని విడుదల చేస్తామని తెలిపారు. సింగూరు ప్రాజెక్టు వద్ద నిర్మించిన జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి చేయడానికి ప్రస్తుతం రెండు టర్బైన్లు చురుకుగా పనిచేస్తున్నాయని జల విద్యుత్ కేంద్రం ఏడీఈ సౌజన్యరెడ్డి తెలిపారు.

ఆరోగ్యశాఖలో డిప్యుటేషన్లు రద్దు!

- సమాచారం కోరిన ఉన్నతాధికారులు
- ఆన్‌డ్యూటీ, వర్క్‌ఆర్డర్ల వివరాల సేకరణ
- ఉద్యోగులు, వైద్య సిబ్బందిలో గుబులు
- జిల్లా వైద్యాధికారులకు త్వరలో స్థాన చలనం!

సంగారెడ్డి అర్బన్, జనవరి 12 : వైద్య ఆరోగ్య శాఖ ప్రక్షాళన దిశగా ఉన్నతాధికారులు అడుగులు వేస్తున్నారు. ప్రస్తుతం ఉద్యోగులు, వైద్య సిబ్బంది డిప్యుటేషన్ విధులపై దృష్టి సారించింది. ఏయే జిల్లాల్లో ఎంత మంది డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు? ఎంత కాలం నుంచి చేస్తున్నారనే వివరాలతో వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు జిల్లా వైద్యాధికారులను నివేదిక కోరారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాలమేరకు ఈ వివరాలు కోరినట్టు వైద్య అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్ర, జిల్లాస్థాయి అధికారులు కోరుకున్న చోటుకు డిప్యుటేషన్‌పై పోస్టింగ్‌లు ఇచ్చారని ఆరోపణలున్న నేపథ్యంలో చర్యలు తీసుకునేందుకు సమగ్ర నివేదిక కోరినట్టు ఆరోగ్యశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో ఏ క్షణమైనా డిప్యుటేషన్లు రద్దు కావచ్చని ఆ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

వంద మందికిపైగా డిప్యుటేషన్లు!

డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పరిధిలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో కొన్నేళ్లుగా డిప్యుటేషన్ల జబ్బు పట్టుకున్నది. పోస్టు, జీతం ఒకచోట ఉంటే పనిచేసేది మరోచోట అన్నట్టు ఉన్నది పరిస్థితి. డిప్యుటేషన్లే కాకుండా ఆన్‌డ్యూటీ, వర్క్‌ఆర్డర్‌ల పేరిట స్థాన చలనానికి అధికారులు తెరలేపారు. ఇందులో డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పరిధిలో కొన్ని జరగగా, మరికొన్ని జిల్లా స్థాయిలో జరిగాయి. ఈ రకంగా సంగారెడ్డి జిల్లాలో 100 నుంచి 200 మంది వరకు ఉద్యోగులు, వైద్య సిబ్బంది డిప్యుటేషన్ విధులు నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. చాలా మంది వివిధ హోదాల్లో డిప్యుటేషన్లపై ఐదేళ్లు, కొందరు పదేళ్ల నుంచి కూడా పనిచేస్తున్నారు. వారికిచ్చిన ఆర్డర్లలో డిప్యుటేషన్ గడువు పేర్కొనకపోవడంతో వారంతా ఏళ్లుగా అలాగే పనిచేస్తూ వస్తున్నారు. సంగారెడ్డి జిల్లాకు చెందినవారు పక్క జిల్లాల్లో.. పక్క జిల్లావారు సంగారెడ్డి జిల్లాలో పనిచేస్తుండడం గమనార్హం. వీరిలో ఆఫీస్ సబార్డినేట్, అటెండర్, డ్రైవర్, ఆశా, ఏఎన్‌ఎం, స్టాఫ్‌నర్సులు, సూపర్‌వైజర్, ఫార్మాసిస్టులు, ల్యాబ్ టెక్నిషియన్లు, హెల్త్ ఎడ్యుకేటర్, డీపీఎంలు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, కొందరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు... ఇలా అన్ని కేడర్ల ఉద్యోగులు, సిబ్బంది డిప్యుటేషన్‌పై ఉండడం గమనార్హం.



సంగారెడ్డిలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం

ఉద్యోగులు, వైద్య సిబ్బందిలో గుబులు

డిప్యుటేషన్లపై ఉన్నతాధికారులు నివేదిక కోరడంపై వైద్య ఆరోగ్యశాఖలో పనిచేసే ఉద్యోగులు, వైద్య సిబ్బందిలో గుబులు మొదలైంది. సొంత స్థానంలోకి తిరిగి వెళ్లాల్సి వస్తదేమోనని ఆందోళన చెందుతున్నారు. ఇనాళ్లు ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకుని అనుకూలమైన ప్రాంతాల్లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. ఎవరడుగుతారనే ధీమాతో సేవలు అవసరం లేకున్నా.. పోస్టే లేని స్థానాల్లో ఏళ్ల తరబడి పనిచేస్తూ వస్తున్నారు. ఈ వ్యవహారంలో పెద్దమొత్తంలో డబ్బు చేతులు మారిందనే ఆరోపణలున్నాయి. అవినీతి అధికారులను ప్రోత్సహించవద్దని, నిజాయితీగా పనిచేసే వారినే జిల్లా అధికారులుగా నియమించుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో సంగారెడ్డి జిల్లాలో జిల్లా వైద్యాధికారులకు కూడా త్వరలో స్థానచలనం ఉంటుందని అధికార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



ఓటు ప్రాముఖ్యతపై వేసిన ముగ్గును పరిశీలిస్తున్న అధికారులు

ఉత్సాహంగా కైట్ ఫెస్టివల్

సంగారెడ్డి అర్బన్, జనవరి 12 : సంగారెడ్డిలోని అంబేద్కర్ స్టేడియంలో కైట్ ఫెస్టివల్‌ను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్‌వో నగేశ్, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, ఇతర అధికారులు ఉత్సాహంగా పతంగులు ఎగురవేశారు. అనంతరం ఓటు ప్రాముఖ్యతపై ముగ్గులు వేసి చైతన్యాన్ని చాటారు. కార్యక్రమంలో స్వీప్ అధికారి, ఎస్సీ అభివృద్ధి అధికారి అఖిలేష్‌రెడ్డి, సంగారెడ్డి తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్ సుజాత, అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



పతంగి ఎగురవేస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

హరీశ్‌రావును కలిసిన నర్సాపూర్ మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్



హరీశ్‌రావుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న మన్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్, ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్, జనవరి 12: నర్సాపూర్ ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న నయిమోద్దీన్ శుక్రవారం మాజీ మంత్రి హరీశ్‌రావును కలిశారు. చైర్మన్ మురళిధర్‌యాదవ్ రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో తాత్కాలికంగా వైస్‌చైర్మన్ నయిమోద్దీన్‌కు చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డితో పాటు బీఆర్ఎస్ కౌన్సిలర్లతో కలిసి మాజీ మంత్రి హరీష్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు ఇన్‌చార్జి చైర్మన్‌ను సత్కరించి అభినందించారు.

కలెక్టర్‌ను అభినందించిన ఎమ్మెల్యే

నారాయణఖేడ్, జనవరి 12: సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహించి, గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శిగా బదిలీ అయిన డాక్టర్ ఎ.శరత్‌నుమాజీకి ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి శుక్రవారం పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. సంగారెడ్డిలో శరత్‌కు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు.

పీర్ల మజీద్ నిర్మాణ పనులు ప్రారంభం



పీర్ల మజీద్ నిర్మాణం పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు శివరాజ్ పాటిల్

సదాశివపేట, జనవరి 12: సదాశివపేట మండలంలోని కంబాలపల్లి గ్రామంలో బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు శివరాజ్‌పాటిల్ తన సొంత నిధులు రూ.2లక్షలతో కొత్తగా నిర్మించ తలపెట్టిన పీర్ల మజీద్ నిర్మాణ పనులకు శుక్రవారం ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ భూమిపూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెద్దగొల్ల శ్రీహరి, ఎంపీపీ అధ్యక్షురాలు తొంట యాదమ్మ, ఎంపీటీసీ మన్నె బాస్కర్, ఉప సర్పంచ్ జాన్ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

టీజీఎల్ఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడి ఎన్నిక

మెదక్ అర్బన్, జనవరి 12: తెలంగాణ గవర్నమెంట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా డా. శ్రీపతి సురేష్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

'తైబంది నీటిని అక్రమంగా వినియోగిస్తున్న వారిపై చర్యలు తీసుకోండి'

వెల్దుర్తి, జనవరి12: మండల కేంద్రమైన వెల్దుర్తి గ్రామ శివారులో ఉన్న దేవతల చెరువు నీటిని యాసంగి సాగుకు ప్రభుత్వ నిబంధనల మేరకు 250 ఎకరాలకు తైబంది నిర్వహించారు. తైబంది నిర్వహించిన పంట పొలాలకు వస్తున్న నీటిని పైభాగంలోని రైతులు అక్రమంగా వారి పొలాలకు మళ్లిస్తున్నారు. దీంతో తైబందీ నిర్వహించిన కింది పొలాలకు సాగు నీరు అందడం లేదని రైతులు శుక్రవారం తహసీల్దార్ తులసీరామ్, ఇరిగేషన్ ఏఈ కవితలకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఇరిగేషన్ ఏఈ కవిత, ఆర్ఐ జయభరత్‌రెడ్డి పంట కాలువలను పరిశీలించారు. అక్రమంగా నీటిని వినియోగిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

మెదక్ నుంచి ఎంపీగా పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వండి: ఆర్‌ఎస్

సంగారెడ్డి టౌన్, జనవరి 12 : రానున్న లోక్‌సభ ఎన్నికల్లో మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని మాజీ ఎమ్మెల్సీ ఆర్. సత్యనారాయణ కోరారు. ఈ మేరకు శుక్రవారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంగ్ కేటీఆర్‌కు, మాజీ మంత్రి టి.హరీశ్‌రావుకు ఆయన లేఖలు పంపించారు. కొన్ని దశాబ్దాలుగా సంగారెడ్డిలో నివాసముంటున్న తనకు మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలతో సత్సంబంధాలు ఉన్నాయని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేస్తూ ప్రజలకు చేరువయ్యానన్నారు. మెదక్ నియోజకవర్గం పరిధిలో తమ సామాజిక వర్గానికి (పద్మశాలి) 1.20 లక్షల ఓట్లు ఉన్నాయని ఆయన తెలిపారు. తెలంగాణ సాధన కోసం కేసీఆర్ ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ పదవిని సైతం త్యాగం చేశానన్నారు. గతంలో ఉమ్మడి మెదక్ జిల్లాకు బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షునిగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, పొలిట్ బ్యూరో సభ్యునిగా సేవలందించానని వివరించారు. ఈ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల ప్రజలతో తనకు సత్సంబంధాలు ఉన్నానని తెలిపారు. ఈ నియోజకవర్గం నుంచి కేసీఆర్‌కు ఒకసారి, కొత్త ప్రభాకర్ రెడ్డికి రెండు పర్యాయాల్లో లోక్‌సభ ఎన్నికల ఏజెంట్‌గా పనిచేశానని తెలిపారు. పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీగా తొమ్మిది నెలలపాటు పనిచేసిన అనుభవం ఉందన్నారు. అలాగే తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుడిగా రెండున్నర సంవత్సరాల పాటు బాధ్యతలు నిర్వహించానని మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ కేటీఆర్‌కు పంపిన లేఖలో వివరించారు.

మత్తు, మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపండి

● టీన్యాబ్ బ్యూరో, ఏడీజీపీ సందీప్‌శాండిల్య



సమీక్షలో పాల్గొన్న జిల్లా అదనపు ఎస్పీ, డీఎస్పీ, సీఐలు

మెదక్ అర్బన్, జనవరి 12: జిల్లాలో మత్తు, మాదకద్రవ్యాల విక్రయం, సరఫరాలపై ఉక్కుపాదం మోపాలని తెలంగాణ స్టేట్ యాంటీ నార్కొటిక్ బ్యూరో(టీన్యాబ్) ఏడీజీపీ సందీప్‌శాండిల్యా సూచించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన జిల్లా పోలీసు అధికారులతో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణ, వాటి నివారణకు తీసుకోవాల్సిన అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంజాయి రవాణాకు పాల్పడిన నిందితులపై అవకాశాన్ని బట్టి పీడీయాక్ట్ నమోదు చేయాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాల వినయోగం వల్ల జరిగే పరిణామాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిందేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. జిల్లాలో మత్తు, మాదకద్రవ్యాల విక్రయాలు, సరఫరా చేస్తున్నట్లు మీ దృష్టికి వస్తే వెంటనే జిల్లాపోలీస్ కంట్రోల్ రూం నెంబర్ 8712657888 సమాచారం అందించాలన్నారు. ఈ సమీక్షలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, తూప్రాన్ డీఎస్పీ యాదగిరి రెడ్డి, జిల్లా సీఐ, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం ఆత్మీయ సమ్మేళనం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

హత్నూర, జనవరి 12: హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ముదిరాజుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గ్రామ శివారులో నిర్వహించిన ఈ ఆత్మీయ సమ్మేళనంలో ముదిరాజ్ కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వన భోజనం అనంతరం మహిళలు, పురుషులు, యువతీ, యువకులు చిన్నారులకు నిర్వహించిన ఆటల పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రూపులుగా, వ్యక్తిగత క్రీడా పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. ఆయా విభాగాలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మహిళలు ఉత్సాహంగా ఆటలు ఆడారు. కార్యక్రమంలో దౌల్తాబాద్ సర్పంచ్ వెంకటేశం, దౌల్తాబాద్ ఎంపీటీసీలు వీరేశం, ఇందిర, ముదిరాజ్ సంఘం ప్రతినిధులు నర్సింలు, భిక్షపతి, సతీష్, సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయ కళాశాలను సందర్శించిన సెక్రటరీ



ట్రైబల్ వెల్ఫేర్ న్యాయ కళాశాలను పరిశీలిస్తున్న ట్రైబల్ వెల్ఫేర్ సెక్రటరీ డాక్టర్ శరత్

సంగారెడ్డి అర్బన్, జనవరి 12 : సంగారెడ్డిలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ న్యాయ కళాశాల(టీటీడబ్ల్యూఆర్‌ఎల్)ను ఆ శాఖ సెక్రటరీ డాక్టర్ ఎ.శరత్ సందర్శించారు. కళాశాలలో కలియ తిరుగుతూ విద్యార్థులతో మాట్లాడారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సౌకర్యాలు, బోధనపై ఆరా తీశారు. ఇబ్బందులు ఏమైనా ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అంతకు ముందు కళాశాల అధికారులు ఆయనకు స్వాగతం పలికారు.

ప్రభుత్వం కొత్త జిల్లాలను రద్దు చేస్తుందట

● ఓడినా ప్రజల వెంటే ఉంటాం

● గజ్వేల్‌లోని అభివృద్ధిని చూసి కాంగ్రెస్ వాళ్లు ఓర్వడం లేదు

● మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



కరెంట్ కష్టాలను మాజీ మంత్రి హరీశ్‌రావుకు విన్నవిస్తున్న మహిళలు

మనోహరాబాద్ జనవరి12: ఇప్పుడొచ్చిన ప్రభుత్వం కొత్త మండలాలను జిల్లాలను రద్దు చేస్తుందట, కొత్త విద్యుత్ పాలసీ తెస్తామంటున్నది, కొత్త పాలసీ అంటే పాత కాంగ్రెస్ కరెంట్ తెస్తారా అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని జీడిపల్లి గ్రామంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ హేమలతతో కలసి ఆవిష్కరించారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించడం చాలా సంతోషంగా ఉందని. తెలంగాణ రాష్ట్రం కేసీఆర్ మొక్కవోని పోరాటం వల్లే వచ్చిందన్నారు. చావు నోట్లో తల పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించింది కేసీఆరే అన్నారు. కేసీఆర్ లేకుండా తెలంగాణ లేదు, కేసీఆర్‌ను తెలంగాణను ఎవరూ వేరు చేయలేరు. తెలంగాణ వచ్చింది కాబట్టే మన నీళ్లు మనకు వచ్చాయని, మన గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. ఆసరా పెన్షన్, రైతుబంధు, రైతు బీమా, కల్యాణ లక్ష్మి, దివ్యాంగులకు పెన్షన్, కేసీఆర్ కిట్ ఇవన్నీ తెచ్చింది మన కేసీఆర్ అన్నారు. ప్రజాతీర్పును అంగీకరిస్తూ బీఆర్‌ఎస్ పార్టీకి వచ్చిన ప్రతి ఓటుకు కృతజ్ఞతతో పని చేస్తాం అన్నారు. మనోహరాబాద్ మండల ఏర్పాటు చేసింది కేసీఆర్, కానీ ఇప్పుడొచ్చిన ప్రభుత్వం వాటిని రద్దు చేస్తుందట. కేసీఆర్ రైతులకు ఇచ్చిన 24 గంటల కరెంట్‌పై కూడా అబద్ధాలు చెబుతున్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. గజ్వేల్ డెవలప్‌మెంట్ అథారిటీనీ రద్దు చేశారు. మనం చేసిన అభివృద్ధిని కక్షతో అడ్డుకుంటున్నారు. కాంగ్రెస్‌కు ప్రజలంటే రాజకీయం, బీఆర్‌ఎస్‌కు ప్రజలంటే బాధ్యత, తెలంగాణ ప్రయోజనాల కోసం ఢిల్లీలో కొట్లాడే ఏకైక పార్టీ బీఆర్‌ఎస్ మాత్రమే అన్నారు. బీఆర్‌ఎస్ ఓడినంత మాత్రాన ప్రజలను వదిలేయమని, వారి పక్షాన పోరాడతామని, బీఆర్‌ఎస్‌కు ప్రజలే దేవుళ్లు అన్నారు. బీఆర్‌ఎస్ మీద ఆరోపణలు చేసే ప్రజలు ఊరుకోరు, ఆరోపణలు మాని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలుచేయాలన్నారు. ఎన్నికల హామీల అమలు కోసం ప్రజల పక్షాన అసెంబ్లీలో గట్టిగా పోరాడతాం అన్నారు. అనంతరం కొంతమంది మహిళలతో ఆయన మాట్లాడగా... కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కరెంట్ సరిగా రావాడంలేదని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌డీసీ మాజీ చైర్మెన్ ప్రతాప్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మెన్ బాలకృష్ణరెడ్డి, మండల అధ్యక్షుడు పురం మహేష్, రాష్ట్ర సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, ఎలక్షన్‌రెడ్డి, సర్పంచ్ రేఖామల్లేష్, రాజుయాదవ్, సర్పంచుల, ఎంపీటీసీలు బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



జిడీపల్లి గ్రామంలో మాట్లడుతున్న హరీశ్‌రావు

ఉపాధిహామీ పథకాన్ని వేగవంతం చేయాలి

● జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాసరావు



మండల కేంద్రంలో నిర్వహించిన ఉపాధి హామీ పథకం గ్రామ సభలో మాట్లాడుతున్న డీఆర్డీవో అధికారి శ్రీనివాసరావు

గుమ్మడిదల, జనవరి 12 : గ్రామాల్లో ఉపాధి హామీ పథకాన్ని వేగవంతం చేసి కూలీల సంఖ్యను పెంచే విధంగా అధికారులు, సిబ్బంది చొరవ తీసుకోవాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శుక్రవారం గుమ్మడిదల మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ మూడో విడత ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఆర్‌డీవో శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ ప్రజా వేదికలో 2022-23 సంవత్సర కాలంలో ఉపాధి హామీ పథకం కింద చేసిన పనులను ప్రజావేదికలో చదివి వినిపించారు. ప్రస్తుతం 32 లక్షల 19 వేల రుపాయలు కూలీల సామగ్రికి ఖర్చు చేశామని ఆడిట్ చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామస్థాయిలో ఉపాధి హామీ రికార్డులు పూర్తిస్థాయిలో నిర్వహించాలని తెలిపారు. చెట్లు ఎండిపోయిన చోట మొక్కలను నాటే విధంగా చొరవ తీసుకోవాలన్నారు. కొత్తగా 50 వరకు జాబ్ కార్డులు మంజూరు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, విజిలెన్స్ ఆఫీసర్ నాగేశ్వరావు, ఎంపీవో అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పొట్టగొట్టి పెట్టుబడిదారుల కొమ్ముకాస్తున్న బీజేపీ

● సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ ఆరోపణ



సంగారెడ్డిలోని కేకే భవన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్

సంగారెడ్డి రూరల్, జనవరి 12 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల పొట్టగొట్టి పెట్టుబడిదారుల కొమ్ముకాస్తున్నదని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ ఆరోపించారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సీఐటీయూ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కుదించి, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్పోరేట్‌లకు అనుకూలంగా చట్టాలు చేసిన బీజేపీ ప్రభుత్వానికి భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. ఒకవైపు నిత్యావసర సరకులు, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి కనీస వేతనాలు ఇవ్వకుండా కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్నదని విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేసే మోదీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నెల 26వ తేది నుంచి ఫిబ్రవరి 16వ తేది వరకు నిర్వహించే క్యాంపెయిన్‌ను జయప్రదం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, జీ. సాయిలు, నాయకులు విద్యాసాగర్, వరలక్ష్మీ, నాగేశ్వరరావు, బాబురావు, కొండల్‌రెడ్డి, జయరం, వంశీ, శ్రీధర్‌రావు, సత్తిబాబు, విజయ తదితరులు పాల్గొన్నారు.

90 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న బియ్యంతో విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ ద్రోణాచార్యులు, తహసీల్దార్, ఎస్‌ఐలు

కల్హేర్, జనవరి 12; మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న 90 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకుని శుక్రవారం విజిలెన్స్ అధికారులకు అప్పగించారు. మండల పరిధిలోని ఖానాపూర్(కె) చౌరస్తాలో టీఎస్ 12 యుబీ, 6646 నంబరు గల డీసీఎం వ్యాను గురువారం రాత్రి రొడ్డుపై ఉన్న బురదలో దిగబడింది. కంగ్టి సీఐ హన్మంతు అటువైపుగా వెళ్తూ ఆ వ్యానును గమనించి అందులో ఏమున్నాయని డ్రైవర్‌ను ప్రశ్నించాడు. అందులో నూకలు ఉన్నాయని మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు డ్రైవర్ తెలిపినట్లు తెలిసింది. దీంతో అనుమానం వచ్చిన సీఐ వ్యానుపై కప్పిన కవర్‌ను తొలగించి చూడగా, అందులో రేషన్ బియ్యం ఉండడంతో కల్హేర్ ఎస్‌ఐ వెంకటేశాన్ని పిలిపించి వ్యానును ఆయనకు అప్పగించారు. వెంటనే రాష్ట్ర విజిలెన్స్ అధికారులకు సమాచారమందించగా, పౌర సరఫరాల శాఖ రాష్ట్ర విజిలెన్స్ టీం అడిషనల్ ఎస్పీ ద్రోణాచార్యులు, ఎస్‌ఐలు వెంకటేశ్వర్లు, సాంబశివరావ్, తహసిల్దార్ ప్రభాకర్, డిప్యూటీ తహసిల్దార్లు సాయిరవి, రాజు పటేల్ కల్హేర్‌కు చేరుకుని డీసీఎం వ్యానులోని బియ్యాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన బియ్యాన్ని పౌరసరఫరాల గోదాంకు తరలించారు. విచారణ అనంతరం పూర్తి స్థాయిలో వివరాలు తెలిసే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ఆస్తిలో వాటా అడుగుతున్నదని.. రెండో భార్యను హత్య చేయించిన భర్త



నారాయణఖేడ్‌లో వివరాలు తెలుపుతున్న పోలీసులు

నారాయణఖేడ్, జనవరి 12: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణంలో ఈ నెల 8న అనుమానాస్పదస్థితిలో మృతిచెందిన మహిళది హత్యేనని, ఈ హత్యలో ఆమె భర్తే కీలక సూత్రధారని పోలీసులు తేల్చారు. ఆస్తిలో వాటా అడగమే కాకుండా ఇల్లు కొనివ్వాలని కోరినందుకు రెండో భార్యను భర్త హత్య చేయించాడు. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు... పట్టణానికి చెందిన సయ్యద్ యూనుస్‌కు మొదటి భార్య ఉండగా, అంజూమ్‌బేగం(39)ని రెండో వివాహం చేసుకున్నాడు. అంజూమ్‌బేగం ఆరు నెలలుగా సొంతిల్లు కట్టించాలని, లేదా కొనుగోలు చేసి ఇవ్వాలని భర్తను కోరుతూ వస్తున్నది. అంతే కాకుండా ఆస్తిలో వాటా ఇవ్వాలని గొడవ పడుతున్నది. ఆమెను హత్య చేస్తే ఆస్తి మిగలడంతో పాటు తనకు మానసిక ప్రశాంతత ఉంటుందని భావించాడు యూనుస్. ఈ నెల 6న తన అన్న కుమారుడైన అయూబ్‌తో ఈ వివరాలు చెప్పాడు. అంజూమ్‌ను హత్య చేస్తే ఎంత డబ్బయినా ఇస్తానని, దుబాయ్‌కి పంపిస్తానని, పోలీసు కేసు కాకుండా చూస్తానని హామీ ఇచ్చాడు. దీంతో అంజూమ్‌ను హత్య చేసేందుకు అయూబ్ ఒప్పుకున్నాడు. ఈ నెల 8న మధ్యాహ్నం 2 గంటలకు అయూబ్ తన స్నేహితుడైన మైనర్‌తో కలిసి అంజూమ్ అద్దెకు ఉంటున్న ఇంటికి వెళ్లాడు. మైనర్‌ను ఇంటి బయట ఉంచిన అయూబ్ ఇంట్లోకి వెళ్లి బెడ్రూంలో ఉన్న అంజూమ్‌బేగం కంటిపై, నుదిటిపై గట్టిగా పిడిగుద్దులు గుద్దాడు. ఆమె కింద పడిపోవడంతో బెడ్రూం నుంచి వంట గదిలోకి లాక్కెని వెళ్లి ప్లాస్టిక్ వైపర్‌తో గట్టిగా కొట్టడంతో ఆమె మృతి చెందింది. ఆ తర్వాత హత్య చేసిన విషయం యూనుస్‌కు ఫోన్‌లో చెప్పాడు. వారిని కర్ణాటకలోని బీదర్‌కు పారిపొమ్మని యూనుస్ సలహా ఇచ్చాడు. విచారణలో భాగంగా అంజుమ్‌బేగం హత్య కేసులో మొదటి నిందితుడైన అయూబ్, రెండో నిందితుడైన యూనుస్‌లను అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చడమే కాకుండా రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ కేసు మూడు రోజుల్లోనే ఛేదించినట్లు సీఐ శ్రీనివాస్ రెడ్డి వివరించారు.

విద్యార్థికి రాష్ట్ర స్థాయి అవార్డు

పాపన్నపేట, జనవరి 12: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదవుతున్న చాకలి విగ్నేష్ ఇంటింటా ఇన్నోవేటర్‌లో రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికయ్యాడు. దివ్యాంగులు, వయోవృద్ధులు, పక్షవాతం వచ్చిన వారు, యాక్సిడెంట్‌లో చేతులు విరిగిన వారికి వేసేందుకు ప్రత్యేకమైన చొక్కాను రూపొందించాడు. పాపన్నపేట మండలం నాగసానిపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు అశోక్‌కుమార్ సహకారంతో విగ్నేష్ ఈ చొక్కాను రూపొందించాడు. అవార్డు దక్కించుకున్న విద్యార్థిని నాగసాన్‌పల్లి గ్రామస్థులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడా రాంకిషన్, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్ర రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడి ఎన్నిక



గణేష్ కుమార్

చేగుంట, జనవరి 12: రాష్ట్ర రగ్బీ అసోసియన్ అధ్యక్షుడిగా కరణం గణేష్ రవికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఈ ఎన్నికల్లో 16 జిల్లాల ప్రతినిధులు ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు బైలాస్ ప్రకారం 4 సంవత్సరాలు కొనసాగుతుందని, ఈ ఎన్నికలలో రిజిస్టర్ అయిన 25 జిల్లాలకు చెందిన 16 జిల్లాల ప్రతినిధులు ఏకాభిప్రాయం ప్రకారం అధ్యక్ష ఎన్నికలు నిర్వహించారు. రాష్ట్ర క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించే దిశగా మరింత కృషి చేస్తానన్నారు. తన గెలుపుకు వెన్నంటి ఉండి ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు.

గాయపడిన కృష్ణ జింక మృతి

రేగోడు జనవరి 12: కుక్కల దాడిలో గాయపడిన కృష్ణ జింక మృతి చెందిన సంఘటన రేగోడు మండలం తాటిపల్లి గ్రామ శివారులో జరిగింది. గురువారం రాత్రి రేగోడు మండలంలోని తాటిపల్లి గ్రామ శివారులో కృష్ణ జింకను కుక్కలు వెంబడించాయి. మిషన్ భగీరథ ట్యాంకుల సమీపంలో వెంచర్‌కు వేసిన ఇనుప జాలికి కృష్ణ జింక తగిలి పడిపోవడంతో కుక్కలు వచ్చి గాయపరిచాయి. అటుగా వెళుతున్న తాటిపల్లి గ్రామస్థులు కుక్కలను తరిమేసి జింకను కాపాడారు. పోలీసులకు, అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే కృష్ణ జింక తీవ్రగాయాలతో మృతి చెందింది. పెద్ద శంకరంపేట ఫారెస్టు అధికారులు మృతిచెందిన కృష్ణ జింకను స్వాధీనం చేసుకున్నారు. పెద్ద శంకరంపేట మండలం వెంకటాపురం అటవీ ప్రాంతంలో వెటర్నరీ అధికారులతో పోస్టుమార్టం నిర్వహించి దహనం చేశామని బీట్ ఆఫీసర్ నర్సింలు తెలిపారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



ఖేడ్‌ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్‌డీఎఫ్ నాయకులు

నారాయణఖేడ్, జనవరి 12: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐఎస్‌డీఎఫ్ ఉమ్మడిజిల్లా నాయకులు తెంకటికుమార్ ఖేడ్ ఆర్డీవో కార్యాలయ అధికారులకు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఫీజురియింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు వసతి గృహంలో ఉండే విద్యార్థుల మెస్, కాస్మోటిక్ చార్జీల బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. గురుకులాల కోసం సొంత భవనాలు నిర్మించాలని, విశ్వవిద్యాలయాలను బలోపేతం చేస్తూ జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం ఉమ్మడిజిల్లా నాయకులు పవన్, అనిల్, మహిపాల్, శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

పోక్సో కేసులో నేరస్థునికి ఏడాది జైలు

హుస్నాబాద్, జనవరి 12 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) గ్రామానికి చెందిన బోయిని వంశీ అనే నేరస్తుడికి శుక్రవారం సిద్దిపేట ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ పోక్సో కోర్టు జడ్జి పోక్సో కేసులో ఒక సంవత్సరం జైలు శిక్ష, రూ. 1,100 జరిమానా విధించారు. ఎస్‌ఐ తోట మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. 2019 నవంబరు 6వ తేదీన హుస్నాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(16)ను స్కూల్‌కు వెళ్ళి వచ్చే క్రమంలో బోయిని వంశీ ప్రేమ, పెళ్లి అంటూ వేధింపులకు గురి చేశాడు. బాలిక పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితుడిపై కేసు నమోదు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించారు. అప్పటి నుంచి సిద్దిపేట ఫస్ట్ ఏడీజే పోక్సో కోర్టులో కేసు విచారణ జరిగింది. వంశీపై నేరం రుజువైనందున ఏడాది జైలు శిక్షతో పాటు రూ.1,100 జరిమానా విధించినట్లు ఎస్‌ఐ వివరించారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని వ్యక్తి మృతి

కొండపాక, జనవరి 12 : రెండుద్విచక్రవాహనాలు ఢికొనడంతో ఒకరు మృతిచెందారు. ఈ సంఘటన కుకునూరుపల్లి మండలం లకుడారం శివారులో శుక్రవారం రాత్రి జరిగింది. కుకునూరుపల్లి గ్రామానికి చెందిన సూరారం వేణుమాధవ్ మోటార్ సైకిల్‌పై మాత్‌పల్లి నుంచి రాజీవ్ రహదారి మీదుగా కుకునూరుపల్లికి వెళ్తుండగా హైదరాబాద్ నుంచి సిద్దిపేట వైపు వెళ్తున్న మోటార్ సైకిల్ లకుడారం శివారులో ఢీకొట్టింది. దీంతో వేణుమాధవ్ కింద పడిపోవడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. అతన్ని వెంటనే చికిత్స నిమిత్తం హైదరాబాదుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.

ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు

నారాయణఖేడ్, జనవరి 12: సంక్రాంతి ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఖేడ్‌లోని ప్రభుత్వ బాలికల కళాశాల వసతి గృహ విద్యార్థినిలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ సంఘం నాయకులు మాట్లాడుతూ ముగ్గులపోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ బహుమతులను అధికారుల చేతుల మీదుగా అందజేసామని సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు కొటారి నర్సింలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సతీష్, నాయకులురమేష్, పవన్, తదితరులు పాల్గొన్నారు. స్థానిక నియోప్రగతి ఉన్నత పాఠశాలలోనూ బాలికలకు ముగ్గుల పోటీలతో పాటు బాలురకు పతంగుల పోటీలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ కుమ్మరి ప్రకాష్, కరస్పాండెంట్ వెంకటరత్నం, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు. కాగా పట్టణంలోని నియోప్రగతి పాఠశాల ఆవరణలో సంక్రాంతి ముగ్గులపోటీలను నిర్వహించారు.

ప్రభుత్వ ఆధ్వర్యంలో ఘనంగా ముగ్గుల పోటీ

జోగిపేట, జనవరి12: ఓటరు అవగానా కార్యక్రమంలో భాగంగా, శుక్రవారం జోగిపేటలో ప్రభుత్వ అధికారులు మహిళలకు ముగ్గుల పోటీ నిర్వహించారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ఈ ముగ్గుల పోటీకి విశేషమైన ఆదరణ లభించింది. మహిళలు పోటీలు పడి ముగ్గులు వేశారు. ఈసందర్భంగా, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు కలిసి ఆర్డీవో ఆర్. పాండు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కాగా, ముగ్గుల పోటీ విజేతలను జనవరి 26న ప్రకటిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తిరుపతి, తహసీల్దారు ఆంటోనీ, ఇంచార్జి ఎంపీడీవో సౌజన్యారావు, మెప్మా గీఎంసీ భిక్షపతి గౌడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినయ్ కుమార్, అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



నారాయణఖేడ్‌లో విజేతలకి బహుమతులు అందజేస్తున్న అనుపమారెడ్డి



జోగిపేటలో ముగ్గులు వేస్తున్నయువతులు

14న మర్వెల్లిలో ముగ్గుల పోటీలు

రేగోడు జనవరి 12: ఈనెల 14వ తేదీన మర్పల్లి గ్రామంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్యారారం గ్రామానికి చెందిన తెలుగు నర్సింలు తెలిపారు. మర్పల్లి శ్రీవిఠలేశ్వర ఆలయం సమీపంలో నిర్వహించే ముగ్గుల పోటీల్లో మహిళలు భారీగా పాల్గొనాలని కోరారు. విజేతలకు బహుమతులు అందిస్తామని అన్నారు.

సంక్రాంతి ప్రకృతి పండగ :అనుపమారెడ్డి

నారాయణఖేడ్,జనవరి 12: సంక్రాంతిపర్వదినం ప్రకృతి పండగ అని, మనిషికి, మట్టికి, మనిషికి ప్రకృతికి ప్రధానంగా సూర్యుడికి, మానవుడికి మధ్యన ఉన్న బంధాన్ని తెలియజెప్పడం కోసమే సంక్రాంతి పండగ జరుపుకుంటామని స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి సతీమణి అనుపమ్మరెడ్డి అన్నారు. శుక్రవారం నారాయణఖేడ్ పట్టణంలోని వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులకు నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పాల్గొని విజేతలకు బహుమతులను ప్రదానం చేసి, అనంతరం మాట్లాడారు. ప్రతీ జీవికి ప్రత్యక్షదైవమైన సూర్యుడి మకర ప్రవేశం సందర్భంగా సంక్రాంతిపర్వదినాన్ని అన్ని వర్గాల వారు జరుపుకుంటారన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన వారికి అనుపమ్మ రెడ్డి వ్యక్తిగతంగా బహుమతులను అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రవీందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వివేకానందుడి స్ఫూర్తిని కొనసాగించాలి

● జయంతి సభల్లో వక్తలు

స్వామి వివేకానంద జయంతిని శుక్రవారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. వివేకానందుడి స్ఫూర్తిని నేటి యువత కొనసాగించాలని కోరారు. వివేకానందుడి జీవితం ఆదర్శనీయమని చెప్పారు. పలు గ్రామాల్లో విగ్రహాలను ఆవిష్కరించారు.

సదాశివపేట, జనవరి 12: సదాశివపేట మండలంలోని ఆత్మాకూర్ గ్రామంలో వివేకానంద యూత్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వామి వివేకానందుడి విగ్రహాన్ని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆవిష్కరించారు. విగ్రహ దాత, డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యంను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ తొంట యాదమ్మ, బీఆర్ఎస్ నాయకులు శివరాజ్ పాటిల్, సర్పంచ్ గంగన్న, ఎంపీటీసీ సత్యనారాయణయాదవ్, రైతుబంధు మండలాధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ వై.సంగమేశ్వర్ పాల్గొన్నారు. సదాశివపేటలో వివేకానంద విగ్రహానికి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆర్.శ్రీధర్‌రెడ్డి, కౌన్సిలర్లు ఇంద్రమోహన్‌గౌడ్, పిల్లోడి విశ్వనాథం, ఎంపీపీ తొంటయాదమ్మ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెద్దగొల్ల ఆంజనేయులు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఓదెల మాణిక్‌రావు పాల్గొన్నారు.

●**నారాయణఖేడ్:** మున్సిపల్ కార్యాలయం ఆవరణలోని స్వామి వివేకానంద విగ్రహానికి ఎమ్మెల్యే సంజీవరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే పలు సంఘాల నాయకులు నివాళులర్పించారు. కౌన్సిలర్లు ఆనంద్ స్వరూప్ షెట్కార్, దారం శంకర్, వివేకానంద్, మాజీద్, నర్సింలు, యాదవరెడ్డి, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. బీఆర్ఎస్ తరఫున జడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్‌నాయక్, పార్టీ పట్టణ అధ్యక్షుడు నగేష్ నివాళులర్పించారు.

●**మెదక్ అర్బన్:** మెదక్ కలెక్టరేట్‌లో వివేకానంద చిత్రపటానికి కలెక్టర్ రాజర్షిషా పూల మాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని వెస్లీ ఉన్నత పాఠశాల మైదానంలో మెదక్ ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన లీగ్ పోటీలను జిల్లా యువజన క్రీడల అధికారి నాగరాజు ప్రారంభించారు.



శ్రీ అక్షయ జూనియర్ కళాశాలలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ రూపేష్

●**సంగారెడ్డి అర్బన్:** కొండాపూర్ మండలం మల్కాపూర్ చౌరస్తా సమీపంలోని శ్రీ అక్షయ జూనియర్ కళాశాలలో జాతీయ యువజన దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ రూపేష్ హాజరై మాట్లాడారు. లక్ష్య సాధనకు కఠోర శ్రమ చేయాలని సూచించారు. శ్రీ అక్షయ యూత్ ఫెస్ట్‌లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వీరప్ప, ప్రిన్సిపాల్ శ్రీశైలం, డైరెక్టర్లు రాజుగౌడ్, సుధాకర్‌జోషి, భానుచందర్‌రెడ్డి పాల్గొన్నారు. సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువ కేంద్ర, ఎన్ఎస్ఎస్ యూనిట్స్, ఎన్‌సీసీ, ట్రాఫిక్ పోలీస్, ట్రాన్స్‌పోర్టు డిపార్ట్‌మెంట్‌ల సహకారంతో యువజన దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ రాములు, ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో స్వామి వివేకానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మెదక్ కలెక్టర్ రాజర్షిషా

●**జోగిపేట:** జోగిపేటలో విశ్వహిందూ పరిషత్, సంఘ్ పరివార్ సభ్యులు వివేకానందుడి విగ్రహానికి వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో మిత్ర-87 ప్రధాన కార్యదర్శి అల్లె మహావీర్, వివేకానంద ఫౌండేషన్ అధ్యక్షుడు శేరి జగన్మోహన్‌రెడ్డి, ఆర్ఎస్ఎస్ ప్రచారక్ తీర్థాల సుబ్రహ్మణ్యశర్మ పాల్గొన్నారు.

●**జిన్నారం:** జిన్నారంలో యువజన సంఘాల నాయకులు వివేకానంద చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, రమేష్, బ్రహ్మేందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రావణ్, భరత్, అనిల్, శివ, నిఖిల్ పాల్గొన్నారు.

●**జహీరాబాద్:** పట్టణంలోని పద్మశాలీ భవన్‌లో వివేకానంద యూత్ ఆధ్వర్యంలో జయంతిని ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చంద్రశేఖర్, అప్పంశ్రవణ్, పూల సంతోష్ పాల్గొన్నారు.

●**చిన్నశంకరంపేట:** మండలంలో కేంద్రంలోని స్వామి వివేకనంద జయంతిని బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రాజు, మల్లిఖార్జున్, సంతోష్, అంజనేయులు పాల్గొన్నారు.

●**తూప్రాన్:** పట్టణంలో స్వామి వివేకానంద విగ్రహాన్ని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బొంది రాఘవేందర్‌గౌడ్, సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్కుల మహిపాల్‌రెడ్డి, శివంపేట ఎంపీపీ హరికృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, విగ్రహ దాత తుమ్మెట శ్రీనివాస్ యాదవ్ ఆవిష్కరించారు.

●**కల్హేర్/సిర్గాపూర్:** మండలంలోని మార్డి, మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో వివేకానంద జయంతి వేడుకలను నిర్వహించారు. సిర్గాపూర్‌లో ఎంపీడీవో సుజాత, సిర్గాపూర్ సర్పంచ్ స్వప్నశంకరయ్య, ఎంపీటీసీ పీరప్ప, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సంజీవరావ్ పాటిల్, భారత జాగృతి జిల్లా విభాగం అధ్యక్షుడు అరుణ్‌రాజ్ శేరికార్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో వివేకానందుడి విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

●**హవేళిఘనపూర్:** తొగిట, హవేళిఘణపూర్ గ్రామాల్లో వివేకానంద జయంతిని యువజన సంఘం సభ్యులు నిర్వహించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు అవినాష్ గౌడ్, శ్యాంసుందర్, నవీన్ ఫనిరాజ్, సురేందర్ రెడ్డి, పూర్ణేశ్వర్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

●**కంగ్టి:** కంగ్టితో పాటు తడ్కల్, నాగన్‌పల్లి గ్రామాల్లో శ్రీనివాస్‌రెడ్డి, గంపల్లినగేష్, సంగ్రాం, సంతోష్, కిరణ్, విఠల్, రవి, సాయినాథ్, ప్రణయ్ పాల్గొన్నారు.

●**రాయికోడ్:** మండల కేంద్రమైన రాయికోడ్‌తో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని యువజన సంఘాల ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి ఘనంగా జరుపుకున్నారు.

●**పుల్‌కల్:** ఉమ్మడి పుల్కల్ మండలంలో నిర్వహించిన వేడుకల్లో స్వామి వివేకానంద జిల్లా అధ్యక్షుడు శేషాద్రి, బీసీ యువజన సంఘం అధ్యక్షుడు పుల్కల్ అధ్యక్షుడు ఆత్కూరి రవీందర్, గో రక్ష ప్రముఖ్ పల్లె ప్రభుకుమార్‌గౌడ్, పుల్కల్ సర్పంచ్ దప్పూరి శ్రవణ్ కుమార్, ఎంపీటీసీ అవుసలి శ్రీనివాసచారి, డీసీసీబీ మాజీ డైరెక్టర్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రాంసాని రామచంద్రారెడ్డి, నాయకులు రఘు, కులకర్ణి, యువజన సంఘాల నాయకుడు ఆలూరి బ్రహ్మానందారెడ్డి, దామోదర్, నగేశ్, లక్ష్మణ్, రాజు, శ్రీకాంత్, నర్సింలు పాల్గొన్నారు.



ఖేడ్‌లో స్వామివివేకానంద విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

●**గుమ్మడిదల:** మండల కేంద్రంలో మైత్రి ఫౌండేషన్ యువజన సంఘాల ఆధ్వర్యంలో వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కుమార్‌గౌడ్, సర్పంచ్ చిమ్ముల నరసింహారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పుట్ట నర్సింగరావు, మాజీ ఎంపీటీసీ మద్దుల బాల్‌రెడ్డి, మైత్రి ఫౌండేషన్ చైర్మన్ ఉదయ్ కుమార్, మాజీ వార్డు సభ్యులు వాసుదేవరెడ్డి, సీహెచ్ సూర్యనారాయణ, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు యాదవ్, బీజేపీ నాయకులు అమ్మగారి రాంరెడ్డి, ఆర్ఎస్ఎస్ నాయకులు శ్రీకాంత్, ఉదయ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

●**మనోహరాబాద్:** మండలంలో వివేకానందుడి జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పూల అర్జున్, కాళ్లకల్ ఉపసర్పంచ్ రాజుయాదవ్, వార్డు సభ్యులు శ్రీశైలం, నరేష్, ముస్తాఫా, దుర్గేష్‌యాదవ్, శ్రీరామ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

●**పెద్దశంకరంపేట:** పెద్దశంకరంపేటలోని వివేకానంద విగ్రహానికి ఎంపీపీ జంగం శ్రీనివాస్, సర్పంచ్ అలుగుల సత్యనారాయణ, ఆర్‌విఎస్ సంస్థ అధ్యక్షుడు గంగారెడ్డి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాయిని మధుసూదన్, రాష్ట్ర ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి జనార్ధన్, ఆయా పార్టీల నాయకులు ఆర్ఎస్.సంతోష్‌కుమార్, జంగం రాఘవులు, లక్ష్మణ్, మైసయ్య, సంగమేశ్వర్, హరికిషన్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. శ్రీసరస్వతీ శిశుమందిర్‌లో వివేకానందుడి జయంతిని ఘనంగా నిర్వహించారు.

●**రామాయంపేట:** పట్టణంలో వివేకానంద జయంతిని కాంగ్రెస్, బీఆర్ఎస్, వీహెచ్‌పీ నేతలు ఘనంగా నిర్వహించారకు. ఆయా కార్యక్రమాల్లో ఎస్ఐ రంజిత్, మునిసిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

●**చిలప్‌చెడ్/రేగోడు:** రెండు మండలాల్లో స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు.

●**నర్సాపూర్:** నర్సాపూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మురళిధర్‌యాదవ్, కౌన్సిలర్లు రాజేందర్, బుచ్చేస్‌యాదవ్, సురేష్, ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షుడు చిన్నరమేష్‌గౌడ్ పాల్గొన్నారు. ఎల్లంకి కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్, కృషి విజ్ఞాన్ సంస్థ అధ్యక్షుడు లక్ష్మీకాంతం, ప్రిన్సిపాల్ అశోక్ పాల్గొన్నారు.

ఆభరణాల కోసం మహిళ హత్య

సంగారెడ్డి క్రైం, జనవరి 12: ఆభరణాల కోసం ఓ మహిళను మరో ఇద్దరు మహిళలు హత్య చేశారు. సంగారెడ్డి రూరల్ ఎస్ఐ రాజేష్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. కంది మండలం ఆరుట్ల గ్రామానికి చెందిన ఎల్లంగారి సుగుణ(35) గతేడాది డిసెంబరు 11న షాపింగ్ కోసం నర్సాపూర్‌కు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె భర్త ఎల్లంగారి రాజు అదేనెల 14న సంగారెడ్డి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసుగా నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అయితే ఆరుట్ల గ్రామానికే చెందిన ఎల్లంగారి లక్ష్మిపై అనుమానంతో పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. అందోల్ మండలం డాకూర్‌కు చెందిన తన అక్క కూతురు రాగయని లక్ష్మితో కలిసి సుగుణని హత్య చేసినట్లు ఎల్లంగారి లక్ష్మి ఒప్పుకుంది. పాత కక్షల నేపథ్యంలోనే హత్య చేసినట్లు నిందితులు అంగీకరించారు. పథకం ప్రకారమే సుగుణను నర్సాపూర్‌కు షాపింగ్‌కు తీసుకెళ్లి అక్కడే కల్లు తాగించి అటవీ ప్రాంతంలో సుగుణ గొంతుకు కండువా బిగించి హత్య చేశారు. తర్వాత సుగుణ ఒంటిపై ఉన్న బంగారు, వెండి ఆభరణాలను తీసుకొని మృతదేహాన్ని పెట్రోల్ పోసి నిప్పంటించారు. నిందితులు ఒప్పుకున్నారు. నిందితులు ఇద్దరిని శుక్రవారం నాడు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు పంపామని, వారి నుంచి బంగారు పుస్తెల తాడు, ఒక జత కమ్మలు, కడియాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ రాజేష్ నాయక్ తెలిపారు.

విద్యారంగంలో మైనార్టీలను విస్మరించిన పాలకులు



జహీరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ

జహీరాబాద్, జనవరి 12: విద్యారంగంలో మైనార్టీలను గత పాలకులు విస్మరించారని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ పేర్కొన్నారు. శుక్రవారం జహీరాబాద్ పట్టణంలో ఎంఐఎం ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైనార్టీలకు రిజర్వేషన్ లేకపోవడం వల్లే విద్యారంగంలో వెనుకబడ్డామని అభిప్రాయపడ్డారు. గత పాలకులు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించడం వల్ల ఇప్పుడిప్పుడు కొంతమేర విద్యారంగంలో రాణించేందుకు మైనార్టీ విద్యార్థులు ఉత్సాహం చూపుతున్నారని చెప్పారు. అయినప్పటికీ దళిత, గిరిజనులకంటే విద్యారంగంలో వెనుకబడి ఉన్నామని ఆయన గుర్తు చేశారు. ఉద్యోగ రంగాల్లో కూడా మైనార్టీలు అంతగా ఎదుగలేకపోయారని విచారం వ్యక్తం చేశారు. దీనంతటికి మైనార్టీల్లో చైతన్యం, ఆర్థిక పరిపుష్టిగా లేకపోవడమే కారణమని తెలిపారు. విదార్థులు, తల్లిదండ్రులు గమనించి విద్యాపరంగా ఎదిగేందుకు కృషిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదన్నారు. ముఖ్యంగా విద్యార్థులు చదువుతున్న క్రమంలో లక్ష్యాలను ఏర్పరుచుకుని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని అసదుద్దీన్ సూచించారు. తమవంతుగా ఏటా ఎంఐఎం ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్వాన్ ఎమ్మెల్యే, సంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి కౌసర్ మొహియొద్దీన్, ఎంఐఎం నియోజకవర్గ ఇన్‌చార్జి అత్తర్ అహ్మద్, నాయకులు అజ్మత్, నరేష్ పాల్గొన్నారు.

సిద్ధివినాయక ఆలయంలో జయంత్యుత్సవాలు



స్వామివారిని దర్శించుకున్న మాజీ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్

న్యాల్‌కల్, జనవరి 12: మండల పరిధిలోని రేజింతల్ గ్రామంలో సిద్ధివినాయకుడి ఆలయంలో స్వామివారి జయంత్యువాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 15 వరకు ఉత్సవాలు కొనసాగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పుష్యమాసం పాడ్యమి, ద్వితీయ, తృతీయచతుర్థిని పురస్కరించుకుని ఆలయాన్ని ఉత్సవాలకు ముస్తాబు చేశారు. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రతోపాటు ఇతరత్రా ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి పెద్దసంఖ్యలో తరలిరానున్నారు. ఇదిలా ఉండగా మొదటిరోజు స్వామి వారిని మాజీ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్ దంపతులు, నాయకులు భాస్కర్‌రెడ్డి, గొల్ల భాస్కర్, ఆలయ కమిటీ కార్యదర్శి అల్లాడి నర్సింహులు, తదితరులు దర్శించుకున్నారు.

రైలు కింద పడి తాపీమేస్త్రీ ఆత్మహత్య

తూప్రాన్, జనవరి 12: రైలు కిందపడి తాపీ మేస్త్రీ ఆత్మహత్య చేసుకన్న సంఘటన శుక్రవారం సాయంత్రం తూప్రాన్ పట్టణ పరిధి పడాలపల్లి శివారులో చోటు చేసుకుంది. తూప్రాన్ పట్టణ పరిధి బ్రాహ్మణపల్లికి చెందిన ఎరుకల యాదగిరి(40) శుక్రవారం సాయంత్రం పడాలపల్లి శివారులో కాచిగూడ - నిజామాబాద్ రైల్వే మార్గంలో రైలుకు ఎదురుగా నిలిచి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. కామారెడ్డి రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

మెదక్ అర్బన్, జనవరి 12: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం కొల్చారం మండల పరిధిలోని రంగంపేట శివారులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డికి చెందిన పిట్ల యాదగిరి(38) జోగిపేట వైపు నుంచి బైక్‌పై మెదక్ వైపు వెళ్తున్నాడు. మెదక్ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు సంగారెడ్డికి వైపు వెళ్తున్న క్రమంలో బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో యాదగిరి అక్కడికక్కడే మరణించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గౌస్ తెలిపారు.

ఇద్దరు యువతుల అదృశ్యం



లిఖిత, రోహిణి

మనోహరాబాద్, జనవరి 12: కాళ్లకల్ గ్రామంలో ఇద్దరు యువతులు అదృశ్యమయ్యారు. శుక్రవారం మనోహరాబాద్ ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కాళ్లకల్ గ్రామానికి చెందిన గానుగు లిఖిత(21), వారింటిలో అద్దెకు ఉంటున్న తన స్నేహితురాలు ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన రాగుల రోహిణి(19) ఇద్దరు కలసి ఆధార్ జిరాక్స్ కోసం గురువారం బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం లిఖిత తల్లి నవనీత పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువత ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

కల్హేర్, జనవరి 12: అర్హత కలిగిన యువతీ, యువకులు ఈ నెల 22వరకు ఓటరుగా నమోదు చేసుకోవాని కల్హేర్ తహసీల్దార్ బాలాశంకర్, ఎంపీడీవో శ్రీనివాస్ సూచించారు. కల్హేర్‌లోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఓటరు నమోదు అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకలు ఓటరుగా నమోదు చేసుకోవడానికి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మీబాలయ్య, పంచాయతీ కార్యదర్శి క్రిష్ణచారి, బూత్ లెవల్ ఆఫీసర్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు బేగారి సాయిలు, పోచబోయిన సంతోష్‌కుమార్, చంద్రయ్య, బాగ్‌బాన్ చాంద్, పండరి, కేశయ్య, జనార్ధన్‌గౌడ్, తడుగూరి చిన్న, వడ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా నుంచి అక్రమ ఓటర్లను తొలగించాలి

నారాయణఖేడ్: నారాయణఖేడ్‌లో అక్రమంగా నమోదు చేసుకున్న పలువురి ఓటర్ల పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించాలని కోరుతూ పలు ప్రజా సంఘాల నాయకులు శుక్రవారం ఖేడ్ మున్సిపల్ కమిషనర్ గోపుమల్లారెడ్డితో పాటు స్థానిక ఆర్డీవో కార్యాలయ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. ఖేడ్ పట్టణంలోని 179వ నంబర్ పోలింగ్ బూత్‌లో ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తుల పేర్లు అక్రమంగా నమోదు చేసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ జరిపి వారి పేర్లు తొలగించాలని కోరారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో నాయీబ్రాహ్మణ, కల్లుగీత కార్మిక, కురుమ, అంబేడ్కర్ సామాజిక హక్కులు, అంబేడ్కర్ పూలే సేవా సమితి సంఘాల నాయకులు ఉన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

హత్నూర, జనవరి 12: గ్రామంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని పంచాయతీ సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. శుక్రవారం గుండ్ల మాచునూర్ గ్రామ పంచాయతీ పాలకవర్గ సమావేశం సర్పంచ్ జయంతి శశిధర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. గ్రామ కార్యదర్శి రమణారెడ్డి గత తీర్మానాలు, ఆదాయ వ్యయాలను చదివి వినిపించారు. గతంలో చేసిన తీర్మాన పనులను వెంటనే పూర్తి చేయడంతో పాటు ప్రస్తుతం ఉన్న బడ్జెట్ అనుగుణంగా అభివృద్ధి పనులు కొనసాగించాలని సభ్యులు సమావేశంలో తీర్మానం చేశారు.

ఉన్నత శిఖరాలను చేరుకోవాలి

పెద్దశంకరంపేట, జనవరి 12: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని పెద్దశంకరంపేట ఎంపీపీ జంగం శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం పెద్దశంకరంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. ఇంటర్మీడియట్ జీవితంలో ఎంతో కీలకమైన దశ అన్నారు. ఇంటర్‌లో విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి ముందుకు సాగాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తహసీల్దార్ గ్రేస్‌బాయ్, సర్పంచ్ అలుగుల సత్యనారాయణ, ఎంపీటీసీ వీణసుభాష్‌గౌడ్, కళాశాల ప్రిన్సిపాల్ అవినీష్‌రెడ్డి, లెక్చరర్లు అనంతరాజుశర్మ, మల్లేష్, రాజు, అభిలాష్, ప్రభాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రియాంక గాంధీ జన్మదిన వేడుకలు

రాయికోడ్, జనవరి 12: ఏఐసీసీ నాయకురాలు ప్రియాంక గాంధీ జన్మదిన వేడుకలను శుక్రవారం రాయికోడ్‌లో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మాజీ ఎంపీ సురేష్ షెట్కార్, శంకర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, వినోద్‌పాటిల్, అంజయ్య, ఇంద్రసేనరెడ్డి విదర్శన్‌రెడ్డి, మండలాధ్యక్షుడు బాలాజీనర్సింలు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్‌చారి, నాయకులు చరణ్‌కుమార్, విలాస్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, పోగాకు సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

మిత్రుడి స్మారకార్థం తరగతి గదిని నిర్మించిన విద్యార్థులు

నారాయణఖేడ్, జనవరి 12: మిత్రుడి స్మారకార్థం నారాయణఖేడ్ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో 1997-98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థి కేశవ్ మృతి చెందడంతో ఆయన స్మారకార్థం సహచర విద్యార్థులు రూ.లక్ష 50 వేలతో తరగతి గదిని నిర్మించారు. కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహరాజ్ శుక్రవారం తరగతి గదిని ప్రారంభించారు.

మినీ స్టేడియం కోసం రూ.8.4లక్షలు



చేగుంట మండల కేంద్రంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

చేగుంట, జనవరి 12: చేగుంట మండల కేంద్రంలో మినీ స్టేడియం కోసం రూ.8 లక్షల 40 వేలు వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ విడుదల చేశారని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం చేగుంటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వారంలోపే నిధులు విడుదల చేసినందుకు మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దుబ్బాక నియోజకవర్గంలో ఎక్కడైనా అసంపూర్తిగా ఉన్న భవనాలను పూర్తి చేసే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు భాస్కర్, కొండి శ్రీను, సతీష్, శ్రీకాంత్, ఆగం, స్టాలిన్, శ్రీనివాస్, నర్సింహులు, ఫకీర్ నాయక్, మహేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

నారాయణఖేడ్, జనవరి 12: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి కోరారు. శుక్రవారం నారాయణఖేడ్‌లోని తన నివాసంలో సిర్గాపూర్ మండలం కడ్పల్ గ్రామానికి చెందిన పలువురికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఖేడ్ మున్సిపల్ కౌన్సిలర్లు ఆనంద్ స్వరూప్‌షెట్కార్, దారం శంకర్, మాజీద్, నర్సింలు, నాయకులు రామక్రిష్ణ, సద్దాం, హన్మంతు, సిర్గాపూర్ మండల కాంగ్రెస్ కమిటీ నాయకులు యాదవరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లోచేరిక

సిర్గాపూర్ మండలం గౌడ్‌గాంకు చెందిన పలువురు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు శుక్రవారం నారాయణఖేడ్‌లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారిలో మాజీ సర్పంచ్ బాబురావు, నాయకులు శివాజీరావుపాటిల్, రమేష్, కిషన్‌రావు, గురునాద్, అమర్‌నాథ్‌రావు, విఠల్‌రావు, పుండ్లిక్, మాదవ్‌రావు, ప్రకాష్‌రావు ఉన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సిర్గాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మనీష్‌పాటిల్, నాయకులు యాదవరెడ్డి, మధుసూదన్, రాజురెడ్డి, రాజప్ప, ప్రకాష్, గణపతిరావు, రవి, మారుతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గోదాదేవి కల్యాణం

మెదక్ అర్బన్, జనవరి 12: ధనుర్మాస ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించే గోదాదేవి అమ్మవారి కల్యాణ మహోత్సవం శుక్రవారం జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్త కంచి మధుసూదన్ అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. సంవత్సరంలో ఈ ఒక్కరోజే వేంకటేశ్వరుడితో గోదాదేవి పరిణయాన్ని చూసే భాగ్యం కలుగుతుందని భక్తులు పేర్కొన్నారు. అనంతరం సర్పంచ్ సుజాతకాంతారావు ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో పండితులు భాష్యం మధుసూదన్‌చార్యులు, ఆలయ ప్రధాన అర్చకులు నరేంద్రచార్యులు, పణీంద్రచార్యులు, జితేందర్‌చార్య, రంగాచార్య, వైద్యశ్రీనివాస్‌శర్మ, కృష్ణమూర్తిశర్మ, శేషాచార్య, లక్ష్మణ్‌రావు, కృష్ణారావుశర్మ, ఆలయ కమిటీ సభ్యులు నాజరాజు, కాశీనాథ్, మాణిక్యం, విఠల్ పాల్గొన్నారు.

కుక్క దాడిలో చిన్నారికి తీవ్రగాయాలు

గుమ్మడిదల, జనవరి 12: కుక్క దాడిలో చిన్నారికి తీవ్రగాయాలైన సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగు చూసింది. గుమ్మడిదలలోని కురుమ బస్తీకి చెందిన కానుకుంట హేమలత, శివ దంపతులకు మూడేళ్ల కూతురు శాన్విక ఉన్నది. మూడు రోజుల క్రితం చిన్నారి ఇంటి ఆవరణలో ఆడుకుంటుండగా ఊర కుక్క చిన్నారిపై దాడి చేసి, తీవ్రంగా గాయపరిచింది. చిన్నారి అరుపులు విన్న కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వారు వచ్చి కుక్కను వెంబడించగా పారిపోయింది. చిన్నారిని నారాయణగూడలోని ప్రైవేట ఆస్పత్రికి, అటునుంచి ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతున్నది.

సీఎంఆర్ కేటాయింపులో అలసత్వాన్ని ఉపేక్షించం

● ఈ నెల 31లోగా సీఎంఆర్ పూర్తి చేయాలి

● మిల్లర్లకు మెదక్ కలెక్టర్ రాజర్షిషా హెచ్చరిక



రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా

మెదక్, జనవరి 12: సీఎంఆర్ కేటాయింపుల్లో మిల్లర్ల జాప్యాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తున్నందున ఇక ఉపేక్షించేది లేదని జిల్లా కలెక్టర్ రాజర్షిషా హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలో అధికశాతం సీఎంఆర్ పెండింగులో ఉన్న రైస్‌మిల్లర్లతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఈ నెల 31లోగా సీఎంఆర్‌కు గడువు నిర్దేశించిందని, అప్పటిలోగా పూర్తి చేయని మిల్లర్లపై క్రిమినల్ కేసులతో పాటు ఆస్తులు జప్తు చేయడానికి వెనకాడబోమని హెచ్చరించారు. 13 నెలలు గడుస్తున్నా మిల్లర్లు అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసి సమకూర్చిన ధాన్యాన్ని వేగవంతంగా మిల్లింగ్ జరిపి ఈ నెలాఖరులోగా కోటాకు అనుగుణంగా భారత ఆహార సంస్థకు చేరవేయాలని ఆదేశించారు. ఈ విషయంలో నిర్లక్ష్యానికి తావు లేదని స్పష్టం చేశారు. అవసరమైతే ధాన్యం కొనుగోలు చేసైనా నిర్దేశిత గడువులోగా లక్ష్యానికి అనుగుణంగా సీఎంఆర్ డెలివరీ చేయాలని మిల్లర్లకు సూచించారు. సాధ్యమైనంత వరకూ ఎక్కువ మొత్తంలో బాయిల్డ్ రైస్ నిల్వలు అందించేందుకు ప్రాధాన్యమివ్వాలని చెప్పారు. క్షేత్ర స్థాయిలో ఏవైనా సమస్యలుంటే జిల్లా యంత్రాంగం తరపున పరిష్కరిస్తామని తెలిపారు. మిల్లర్లు పంపించే సీఎంఆర్ నిల్వలను వెంట వెంటనే దిగుమతి చేసుకునేందుకు గోడౌన్ల వద్ద హమాలీల సంఖ్య పెంచాలని ఎఫ్‌సీఐ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ హరికృష్ణ, డీసీఎస్‌వో బ్రహ్మారావు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలకు పార్టీలు సహకరించాలి

మెదక్ అర్బన్: రాబోవు పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ రాజర్షిషా కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో జనాభా ప్రాతిపదికన పోలింగ్ కేంద్రాల పెంపు అంశాలపై పార్టీల నాయకుల అభిప్రాయం పరిగణలోకి తీసుకుంటామన్నారు. ఈ నెల 22 వరకు అభ్యంతరాల క్లెయిమ్స్ స్వీకరణ, ఫిబ్రవరి 2నపరిష్కారం, 8న తుది జాబితాను ప్రకటించనున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణకు సహకరించండి

● ప్రజాస్వామ్య బలోపేతానికి అర్హులందరూ ఓటరుగా నమోదవ్వాలి

● సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి



అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి రూరల్, జనవరి 12: ఓటరు జాబితా సవరణ పక్కాగా నిర్వహించేందుకు సహకరించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులను కోరారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో శుక్రవారం వారితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 22వరకు నూతన ఓటర్ల నమోదు, సవరణకు అవకాశముందని తెలిపారు. డూప్లికేట్, మృతిచెందిన వారి పేర్లు ఓటరు జాబితా నుంచి తొలగించాలని, అర్హులను ఓటరు జాబితాలో నమోదు చేయించాలని సూచించారు. ఓటరు సవరణ కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలని కోరారు. ఈ నెల 20, 21తేదీల్లో పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ క్రాంతి కోరారు. అనంతరం ఓటు మన హక్కు పోస్టర్‌ను ఆవిష్కరించి, అందరిచేత ప్రతిజ్ఞ చేయించారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

26న నిర్వహించే గణతంత్ర వేడుకలకు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ క్రాంతి ఆదేశించారు. వేడుకలకు వచ్చే ప్రజలు, విద్యార్థులకు తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలని మున్సిపల్ కమిషనర్ సుజాతను ఆదేశించారు. మెడికల్ క్యాంపును ఏర్పాటు చేయాలని డీఎంఅండ్‌హెచ్‌వో గాయత్రీదేవికి సూచించారు. విద్యుత్ అంతరాయం కలగకుండా చూసుకోవాలని, జనరేటర్ అందుబాటులో ఉంచాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని డీఈవో వెంకటేశ్వర్లును కలెక్టర్ ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి గణతంత్ర వేడుకలను జయప్రదం చేయాలని కలెక్టర్ క్రాంతి కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్వో నగేష్‌గౌడ్, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, స్వీప్ నోడల్ అధికారి అఖిలేష్ రెడ్డి, పరిశ్రమల శాఖ జీఎం ప్రశాంత్, డీఎంఅండ్‌హెచ్‌వో గాయత్రీదేవి, డీఈవో వెంకటేశ్వర్లు, సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఓటరు నమోదుపై అవగాహనకు 'స్వీప్' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సంగారెడ్డిలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి అఖిలేష్‌రెడ్డి, డిఆర్‌వో నగేష్ గౌడ్, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

- సంగారెడ్డి రూరల్, జనవరి 12: